క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన మూలగేరి లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోతురాజు సోమనాద్రి సూచన మేరకు కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, మంగళ హారతి ఇచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు అంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు, మండలంలోని కొంకల, వెంకట్రామ నగర్ గ్రామాల్లో వెలసిన గ్రామ దేవతల ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పెద్దమ్మ, సవారమ్మ, ఈదమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, జమ్ములమ్మ, తాయమ్మ అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన బంధువులు, స్నేహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, జోగుళాంబ గద్వాల, కర్నూలు, రాయచూర్ జిల్లాలకు చెందిన బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

బాలుడికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో ఏడేళ్ల బాలుడు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొని గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న బాలుడు యశ్వంత్‌గౌడ్ ఆడుకునేందుకు రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని ద్విచక్రవాహనం బాలుడిని ఢీకొన్నది. ఈ ఘటనలో యశ్వంత్‌గౌడ్‌కు గాయాలుకాగా చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి



పెబ్బేరు: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట ఆలయ భూమిలో అక్రమ నిర్మాణ పనులు నిలిపివేయాలని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ అబ్రహాంలింకన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు శ్రీవేణుగోపాల స్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయ భూమి సర్వే నంబర్లు 225, 337, 354లలో మొత్తం 9.36 గుంటల భూమి ఉండడంతో గ్రామంలోని కొందరు వ్యక్తులు భూమిని అక్రమంచి తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని గృహనిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయ భూమిని ఇతరుల పేరు మీదికి ఎలా పట్టా చేశారని, అనుమతులు ఎలా ఇచ్చారని సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమదారుల నుంచి భూమిని జప్తు చేసుకొని వేణుగోపాలస్వామి ఆలయం పేరు మీదికి మార్చి వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రామంలోని నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇదే ఆలయ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాములు, కంచె అంజనేయులు, పరుశరాము, నాగశేషు, సర్వేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

మదనాపురం: గీత కార్మికులకు ప్రమాద బీమా ప్రకటించినందు సీఎం కేసీఆర్, అబ్కారీ శాఖ మంత్రి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని మండల గౌడ సంఘం అధ్యక్షుడు అక్కల మహదేవన్‌గౌడ్ పేర్కొన్నారు. నియోజక వర్గంలో గౌడల అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గౌడల మద్దతు ఉంటుందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర అభివృద్ధితో పాటు కుల వృత్తులకు చేయూతనిచ్చి ఆదుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మద్దతుగా ఉంటామన్నారు.

రాయితీ అందేనా?

- రెండేళ్లుగా నిలిచిన సబ్సిడీ వ్యవసాయ పరికరాలు
- నిరాశలో రైతులు



ట్రాక్టర్‌తో దుక్కిదున్నతున్న రైతు

మానవపాడు: రోజురోజుకు మారుతున్న టెక్నాలజీ అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు చేసుకుంటున్నాయి. పంటల సాగు కోసం కొత్త పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కాలానుగుణంగా వ్యవసాయ పరికరాలను రైతులకు సబ్సిడీ ద్వారా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదట్లో అర్హులైన రైతులకు పనిముట్లను రాయితీ కింద ఇచ్చి ప్రోత్సహించింది. దీంతో ఆధునిక వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపారు. సాగును మూసపద్ధతిలో కాకుండా నూతన పద్ధతిలో పంటలు చేపట్టడానికి ఆసక్తి కనబరిచారు. ఆధునిక వ్యవసాయం చేయాలనుకున్న రైతుల ఆశలు కొన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి.. రాయితీపై అందించే వ్యవసాయ వ్యవసాయ పరికరాలు పంపిణీ రెండేళ్లుగా నిలిచి పోవడంతో రైతులు సాగు సమయంలో యంత్రాలను అద్దెకు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు రాయితీపై అందించాల్సి ఉన్నా అటువైపు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సాగుకు అవసరమయ్యే తైవాన్ స్ప్రేయర్లు, విత్తనాలు వెదజల్లే పరికరాలు, నాగళ్లు, నూర్పిడీ యంత్రాలు, ట్రాక్టర్లు, రోటోవేటర్, ట్రాక్టర్ నాగళ్ల తదితర పానిముట్లు సబ్సిడీపై అందించేవారు.

అయోమయంలో రైతులు

రాయితీ పరికరాల కోసం రైతులు నిత్యం వ్యవసాయం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడ్డది. అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రతిరోజు కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి రైతులు చేరుకుంటున్నారు. పరికరాలు ఎప్పుడు ఇస్తారో స్పష్టంగా చెప్పకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయితీ పనిముట్లు పంపిణీపై గందరగోళ పరిస్థితి ఏర్పడ్డది. ఇప్పటికైనా అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయాలి. రెండేళ్లుగా పనిముట్లు సరఫరా నిలిచింది. దీంతో సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. నాగళ్లు, రోటోవెటర్, ట్రాక్టర్లు సబ్సిడీ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించాలి. అధికారులు నిర్లక్ష్యం వీడాలి.

– మద్దిలేటి రైతు గోకులపాడు

సబ్సిడీ పరికరాలు అందించాలి



ప్రభుత్వం రాయితీ పరికరాలను అందజేయడం లేదు. అవసరమైన పరికరాలను అద్దెకు తీసుకుంటున్నాం. అద్దె చెల్లించేందుకు అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ట్రాక్టర్లు, రోటోవెటర్, తైవాన్ స్ప్రేయర్ వెంటనే సబ్సిడీపై పంపిణీ చేయాలి.

– పెద్ద శంకరన్న, రైతు, మానవపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

రైతులకు రాయితీపై వచ్చే వ్యవసాయ పరికరాలు ప్రభుత్వం నుంచి రావడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలం నుంచి నివేదికలు పంపించాం. మూడు సంవత్సరాల నుంచి వ్యవసాయ కార్యాలయాలకు సబ్సిడీ పరికరాలు రాలేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తాం.

– శ్వేత, మండల వ్యవసాయ అధికారి, మానవపాడు

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



ఉండవెల్లిలో నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మల్దకల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కార్యదర్శులు రాఘవేంద్ర, సత్యానారాయణలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సమ్మె బుధవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయడంతో పాటుగా పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ట్విట్టర్ ద్వారా సందేశాలు పోస్ట్ చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పరుషరాముడు, అయ్యప్పరెడ్డి, హారిక, మారెప్ప, లావణ్య సరిత, కృష్ణవేణి, శుభవతి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో..

ఉండవెల్లి: మండల కేంద్రంలో జేపీఎస్‌ల సమ్మె 6వ రోజు బుధవారం కొనసాగింది. అలంపూర్, ఉండవెల్లి మండలాలకు చెందిన కార్యదర్శులు పాల్గొని నినాదాలు చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి



పెబ్బేరు: రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన ప్రతి పంటకు పరిహారం ఇవ్వాలని బుధవారం తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారన్నారు. అకాల వర్షాలకు వరి, మామిడి, బత్తాయి, కూరగాయలు మిరప తదితర పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రూ.వేలు పెట్టుబడులు పెట్టిన రైతులు నిండా మునిగారన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా నష్ట తీవ్రతను పరిశీలించి ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, సత్యారెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణ, రాజు, మహిళ రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

అమరచింత: అమరచింత, మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి కోలుకోవాలని పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని నెలలుగా మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కనుమరుగైన అమరచింత నియోజక వర్గంతో పాటు మక్తల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించి ఈ ప్రాంత రైతుల కోసం ఎత్తిపోథల పథకాలను సాధించి పెట్టిన ఘనత దయాకర్‌రెడ్డిదే అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభ్యున్నతితో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఇప్పటికి ప్రజల్లో తనకంటూ చెదరని ముద్ర వేసుకున్న దయాకర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు రావాలంటూ అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోదీమనోహర్ రాజు, పట్టణ అధ్యక్షుడు గోపిరెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వరిధాన్యం కొంటాం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ఎర్రవల్లిచౌరస్తా: నాణ్యమైన వరిధాన్యం కొంటామని ఏపీఎం శోభారాణి అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ నాగేశ్వరితో కలిసి ఆమె హాజరై వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తిగా ఆరిన వడ్లను మాత్రమే రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. వడ్లలో ఎలాంటి మట్టి పెల్లలు లేకుండా తీసుకొచ్చి కేంద్రాల్లో ఉన్న అధికారులకు సహకరించాలన్నారు. ముందుగా టోకెన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ, ఏఈఓ మౌనిక, నాయకులు శివుడు, నర్సింహులు, మహిళలు, గ్రామస్తులు, రైతులు, తదితరులు ఉన్నారు.

పీహెచ్‌డీ స్కాలర్‌కు ల్యాప్‌టాప్ బహూకరణ



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన బత్తిని మద్దిలేటి ఉస్మానియా యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో శైవిజం, నాయనార్లపై తాత్విక పరిశోధన చేస్తున్నాడు. అతడికి ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో సర్పంచ్ నిర్మల విషయాన్ని మంత్రి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి బుధవారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.50 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను మద్దిలేటికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి, స్థానిక నాయకులకు బత్తిని మద్దిలేటి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పృథ్వీరాజు, కురుమయ్య, వెంకటేష్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ జమీరుద్దీన్

అమరచింత: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ జమీరుద్దీన్ అన్నారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో బుధవారం ఎస్పీ ఆదేశానుశారం ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. అపరచితులు ఎవరైనా ఫోన్‌చేసి మీ వ్యక్తిగత ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే ఇవ్వొద్దని తెలిపారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని, వాహనాలను నడుపుతూ మైనర్లు పట్టుబడితే బైక్ ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల కాగితాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించి తమ ప్రాణాలను కాపాడుకుంటూ తమ కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో వీరశైవ కల్యాణ మండపానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలవారికి అండగా ఉందన్నారు. వీరశైవులకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, గోవిందు, వీరశైవ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు విత్తనాలు విక్రయించాలని అలంపూర్ సీఐ సూర్యానాయక్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో పలు సీడ్, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపులలోని వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలను, ఎరువులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ అనుమతులు గల విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని అన్నారు. ప్రతి రైతుకు కూడా విత్తనాలు, ఎరువులతో పాటు పురుగు మందులు కొనేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత దుకాణానికి చెందిన ఒరిజినల్ రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా లేదా కాలం చెల్లిన సీడ్, ఎరువులు, పురుగు మందులను అమ్మినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ అయూబ్, ఎస్సై గోకారి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



సద్దలోనిపల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో రెండో రోజు బుధవారం కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 144 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. కంటి వెలుగును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి, కుర్తిరావల్ చెర్వు గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను బుధవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో డాక్టర్లు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వైద్య సిబ్బంది కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్ కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్రెమ్మ, మశమ్మ జాతర



దాసంగాలు తీసుకెళ్తున్న భక్తులు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని బుధవారం కర్రెమ్మ, మశమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న ఆలయం దగ్గర దాసంగాలు, పాటేళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కొందరు మహిళలు పూనకాలు ఊగారు. కుటుంబసభ్యులను చల్లగా చూడాలని దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలోని గ్రామ నాయకులు టీచర్ గోవిందు, ఉరుకుందు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి'



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అయిజ: దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధులో లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పేర్లు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దళితులంతా ఏకమై బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామన్నారు. ఎమ్మెల్యే అవినీతికి వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంజనేయులు, ఏసన్న, రాజు, యోబు, మహేష్, మల్లన్న, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆగమాగం

- నిండాముంచిన అకాల వర్షం
- కోత దశలో నేలకొరిగిన వరిపైరు



ధరూరు శివారులో నేలకొరిగిన వరిపైరు

ధరూరు: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు దిగాలు చెందుతున్నారు. బలమైన ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పంటపొలాల్లో వర్షం నీరు నిలిచాయి. చేతికొచ్చిన పంటలు కళ్లముందే దెబ్బతినడంతో రైతులు దిక్కతోచనిస్థితిలో పడ్డారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోయారు. కోత దశలో ఉన్న వరి పంటలు నేలకొరిగాయి.

విరిగిన చెట్లు..

బారీ గాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో ఎక్కడిక్కడే చెట్లు నేలకొరిగాయి. బలమైన ఈదురు గాలులకు జూరాల రోడ్డులో చింతరేవుల గ్రామ సమీపంలో మూడు చెట్లు రోడ్లపై పడ్డాయి. దీంతో మక్తల్, నారాయణపేట, అమరచింత, ఆత్మకూరు, గద్వాల ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను పీజేపీ క్యాంపు రేవులపల్లి మీదుగా దారి మళ్లించారు.

వరి వర్షం పాలు



ఎకరం పొలంలో వరి పంట సాగు చేశా. వరికోత చేద్దామనుకున్నా. అకాల వర్షాలతో సాగుచేసిన వరి నేలకొరిగింది. బలమైన గాలులకు వరిపైరు పూర్తిగా దెబ్బతింది. ధాన్యం రాశులు భూమి పాలు అయ్యాయి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

– రైతు దావీదు, ధరూరు

రైతులను ఆదుకోవాలి



అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో రైతులు నష్టపోయారు. విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి